www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 1 జనవరి 2024
5
వైఎస్ఆర్



'త్యాగానికి ప్రతిరూపం అమ్మ'

కడప అర్బన్ : అమ్మ త్యాగానికి ప్రతిరూపమని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కాశిం అన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశ హాలులో ఎదిరెపల్లి మశమ్మ స్మారక అవార్డును కడప యోగివేమన యూనివర్సిటీ కమలాపురం సామాజిక ఉద్యమకారిణి డాక్టర్ వినోదిని ఎదిరెపల్లి స్మారక అవార్డును అందజేశారు. అవార్డుతో పాటు శాలువ మెమెంటో సన్మానపత్రం రూ.20వేల నగదును ప్రొఫెసర్ కాశిం సత్కరించి అందజేశారు. ఈసభకు కల్వకోల్ మద్దిలేటి సభా అధ్యక్షత వహించారు. మశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో డాక్టర్ కాశిం మాట్లాడుతూ వీరుడైనా ఉద్యమకారుడైనా, శ్రామికుడైనా ప్రొఫెసరైనా, జీవితాంతం అమ్మ అమ్మనే ,అమ్మకు ప్రత్యామ్నాయం లేదన్నారు. బహుజన తల్లుల కథలు అనుభవాలు రికార్డు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ వినోదిని పాల్గొని మాట్లాడారు.



మైదుకూరులో జగన్ వేషధారుడిని చుట్టుముట్టి పాటపడుతున్న అంగన్వాడీలు

అంగన్వాడీల ఆటా పాట

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ కడప జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఆటపాటలతో ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. మరికొన్ని చోట్ల మెడకు ఉరితాళ్లు బిగించుకుని ఆందోళన చేపట్టారు. చాపాడు మండలంలోని కుందూ నదిలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి తమ కోర్కెలు తీర్చేలా మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు.

- కబడ్డీ ఆడుతూ.. కుందూ నదిలో పూజలు చేస్తూ నిరసన
- 20వ రోజు కొనసాగిన సమ్మె
- టిడిపి, ప్రజాసంఘాల నాయకుల మద్దతు



కడపలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

కడప అర్బన్ : 20 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టి పట్టనట్లు వ్యవహరించడం దారుణమని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం. పి. అంజనీ దేవి అన్నారు. కడప అర్బన్ లో 'ఆడదాం జగన్.. కాస్కో జగన్ ' అంటూ అంగన్వాడీలు కబడ్డీ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కడప అర్బన్ లో నాయకురాలు వరలక్ష్మి, దీప, రామ, పోలమ్మ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దేవగుడి భూపేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా ఎపి అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 20వ రోజు సమ్మెకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ముందుగా అంగన్వాడీలు ఆటపాటలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీలు 20 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం సమస్యల పరిష్కారం చేశామని చెప్పడం తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఉన్నారు. అనంతరం అంగన్వాడీలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సిపిఎం నూతన కార్యదర్శి ఏసుదాసు, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, తెలుగుదేశం పార్టీ నాయకులు కిరణ్ రాయల్, నాగేశ్వర్ రెడ్డి , రమణారెడ్డి ,సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, అంగన్వాడి యూనియన్ నాయకులు భాగ్యమ్మ ,లక్ష్మీదేవి, నరసమ్మ, దస్తగిరి అమ్మ, జ్యోతి, నాగలక్ష్మి పాల్గొన్నారు. **చాపాడు :** 20 రోజులుగా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు ఆదివారం కుందూ నది నీటిలో దిగి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తల మండల నాయకురాలు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. నిత్యం ప్రవహించే కుందూ నదిలోని గంగమ్మ తల్లికి తమ బాధలను విన్నవించామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ, కార్యకర్తలు పాల్గొన్నారు. **మైదుకూరు :** అంగన్వాడీలు ఆదివారం 20వరోజు కబడ్డీ ఆట రూపంలో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు కబడ్డీ ఆట ఆడారు. 'జగన్ మాస్క్ ధరించి చెల్లెమ్మలు నేను ఉన్నాను నేను విన్నాను' అంటూ కూత రూపంలో వెళ్లిన జగన్మోహన్‌రెడ్డి వేషధారుడిని అంగన్వాడీలు చుట్టుముట్టారు. అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి జి.శివకుమార్, యూనియన్ నాయకురాల్లు ధనలక్ష్మి, భారతి, చెన్నమ్మ, రిజ్వాన, జి.లక్ష్మీదేవి, అనురాధ, శ్యామల, రామ తులసి, అనూష, మహేశ్వరి, సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్, సిఐటియు నాయకులు జహంగీర్ భాష, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాయప్ప, వాసు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్, జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పేర్లు పాల్గొన్నారు. **బద్వేలు :** పట్టణంలో 20వ రోజైన ఆదివారం అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్, నాయకులు ఓబుల్‌రెడ్డి హాజరై సమ్మెకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 రోజులుగా అంగన్వాడీలు అనేక ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పిలిచి మాట్లాడేవారని, తమ బాధను విన్నవించిన వెంటనే పరిష్కారం చేసే వారని చెప్పారు. రాజశేఖర్ రెడ్డి వారసునిగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నెరవేర్చడం లేదన్నారు. హామీలు అమలు చేయకపోతే రాబోవు ఎన్నిక్లో గద్దె దించుతామని హెచ్చరించారు. పులివెందుల టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల.పార్థసారథి రెడ్డి, బద్వేల్ మున్సిపాలిటి 13వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ హసన్, అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు శ్రీనివాసులు సిఐటియు సిఐటియు నాయకులు రాజగోపాల్ యుటిఎఫ్ నాయకులు చిన్నయ్య ,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కదిరయ్య, డివైఎఫ్ఐ నాయకులు గురయ్య, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు గౌతమి, మొక్షమ్మా, బాలమ్మ, నాగమ్మ వృత్తిదార్ల సంగం నాయకుడు సుబ్బారాయుడు, అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకురాలు సుభాషిని, ఉషానమ్మ విజయమ్మ, శోభాదేవి, సుభద్ర, జయప్రదమ్మ, రాధమ్మ, రత్నమ్మ, తులసమ్మ, కళావతి, కె.వి సుభాషిని, వాణి, వసంత, సరోజనమ్మ వందలాదిమంది అంగన్వాడీలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఆదివారం చెట్టుకు ఉరి వేసుకొని నిరసన సమ్మె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవప్రసాద్ మాట్లాడుతూ జీతం కోసం 20 రోజులుగా సమ్మె చేస్తూన్న పట్టించుకోని రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రాణాలైనా వదులుతామని చెట్టుకు ఉరి వేసుకొని నిరసన తెలియజేశారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి మేరీ, జిల్లా కమిటీ సభ్యులు ఓబులాపురం, విజయమ్మ లక్ష్మీదేవి, స్వాతి, ప్రభావతి, జమాలమ్మ సుహాసిని మండల అధ్యక్షులు బొజ్జ చిన్నయ్య అంగన్వాడి అధ్యక్షురాలు వినోద దేవి, దస్తగిరిమ్మ, జ్యోతిమ్మ, రేణుక పోరుమామిళ్ల అంగన్వాడి సెక్టార్ లీడర్లు అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు మినీ అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్ :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె 20వరోజుకు చేరుకుంది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ సమ్మెకుమద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఈ పరిస్థితి కొనసాగితే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు.ేంపు జనవరి మూడో తారీకున రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని జిల్లాలో అంగన్వాడీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసిరాష్ట్ర నాయకులు మంజుల, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్, అంగన్వాడీ ఇండియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, విజయ,అంగన్వాడీలు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో అంగన్వాడీలకు అన్నం వడ్డిస్తున్న భూపేష్‌రెడ్డి

అర్ధనగ్న ప్రదర్శన

మోకాళ్లపై నిల్చుని మున్సిపల్ కార్మికుల నిరసన
6వ రోజూ కొనసాగిన సమ్మె



ప్రొద్దుటూరులో నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప అర్బన్ : సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు చేయకుండా మున్సిపల్ కార్మికులను అర్ధ నగ్నంగా చేశారని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య విమర్శించారు. ఆదివారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టారు. తెల్లవారు జాము నుంచే ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ సమ్మె మొదలై 6 రోజులవుతున్నా ఈ ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. బాధ్యత కలిగిన మంత్రి ఆది మూలపు సురేష్ ఆందోళనను నీరు కార్చే ప్రయత్నం మానుకోవాల అని హితవుపలికారు. సమస్యలు పరిష్కారం కాకుండ సమ్మె ను విరమించేది లేదని అన్నారు.బెదిరింపులకు భయపడేది లేదన్నారు. **మైదుకూరు :** మున్సిపల్ కార్మికుల సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరుకుంది. కార్మికులను అప్కాస్ లేకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు, టెక్నికల్ వేతనాలు ఇవ్వాలన్నారు మున్సిపల్ నాయకులు జి. చిన్న అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లక్షుమయ్య, శేకర్, వెంకట సుబ్బయ్య, పుళ్ళమ్మ, విశ్వనాథం, చిన్న రాముడు, నాగయ్య, పాపారాయుడు, ఒబులమ్మ, కార్మికులు పాల్గొన్నారు. **బద్వేలు :** కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె 6వ రోజులో భాగంగా ఆదివారం బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ , ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల సెంటర్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో అంగన్వాడీ వర్కర్లు పాల్గొని తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఎపి దళిత చైతన్య ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సోద్దల పెంచలయ్య పాల్గొని మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు గౌతమి, నాయకురాలు నాగమ్మ, వడ్డెర వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు గంప సుబ్బరాయుడు, సిఐటియు పట్టణ నాయకులు రాజగోపాల్, యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శ్యాం ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు దియ్యాల దేవమ్మ, గంటా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, కార్యదర్శులు నాగరపు సత్యరాజు, బద్వేల్ ప్రవీణ్ కుమార్, నేలటూరు పాలయ్య, కోశాధికారి కాలువ శివకుమార్ కమిటీ సభ్యులు పద్మిశెట్టి రామయ్య, ఇండ్ల చంద్రశేఖర్, తేళ్ల కిరణ్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పనికి తగ్గ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కార్మికులు అర్ధ నగ్నంగా మోకాళ్లపై నిలుచుకొని నిరసన వ్యక్తం చేశారు. నిరసన సమ్మెకు సంఘీభావంగా సిపిఎం పార్టీ నూతన పట్టణ కార్యదర్శి జి.ఏసుదాస్, పార్టీ సభ్యుడు ఏ.వినయ్ కుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి.విజయ్ పాల్గొన్నారు. కార్యక్రమం లో సిఐటియు కమిటీ సభ్యులు నాగన్న కోశాధికారి శివన్న ,చెన్నయ్య. గ్రేస్ అమ్మ. పట్టణ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** న్యాయమైన కోర్కెల సాధన కోసం మున్సిపల్ కార్మికులు ఆరు రోజులుగా సమ్మెచేస్తుంటే కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు సిఫారుసు ద్వారా మంత్రి పదవి దక్కించుకున్న మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ అబద్దాలు వల్లె వేస్తున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారన్నారు. ఆదివారం కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ దాదాపు 3లక్షల జనాభా కలిగిన ప్రొద్దుటూరు పట్టణంలో పారిశుధ్య పనులు సజావుగా ఉన్నాయంటే కార్మికుల కష్టం అర్థం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్, అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పట్టణ పరిశుభ్రతకు వెన్నుముక లాంటి కార్మికుల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తే పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి రాఘవేంద్ర, ప్రమీలమ్మ, గుర్రమ్మ, రమాదేవి, నీతమ్మ, శాంతి, ఓబయ్య, సురేష్, జాకోబు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కోటి ఆశలతో..

- ఊరిస్తోన్న పరిశ్రమల స్థాపన
- 'ఉక్కు' ఏర్పాటుపైనే ఆశలు
- నిర్వాసితుల పరిహారంపై మీనమేషాలు

కొత్త ఏడాది కోటిఆశలతో పలకరిస్తోంది. కొత్త ఉషస్సులతో నవ వసంతం స్వాగతం పలుకుతోంది. గతేడాది వరుస కరువుల బారిన పడినప్పటికీ కొత్త ఏడాది కొత్త ఆశలను మోసుకొస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలు స్వాగతం పలుకుతున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చాల్సిన హామీలపై ప్రజానీకం ఆశలు పెంచుకుంది. 2024 నూతన సంవత్సరం పలువురి లక్ష్యాలకూ ల్యాండ్‌మార్క్‌గా నిలవనుంది. ఈ నేపథ్యంలో ఎవరికి వారు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో ప్రభుత్వమే ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు నడుంబిగించినప్పటికీ ప్రయివేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తామనే హామీ ఆచరణలో అడుగు ముందుకు పడడం లేదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 2024 సంవత్సరం కొత్త ఆశలు రేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆకాంక్షలను అధిగమించడానికి తనదైన ప్రణాళికలతో ముందుకు వెళుతున్నప్పటికీ ఉసురు తీసుకున్న రైతులకు పరిహారం పెంచినప్పటికీ ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు మొదలుకుని సాగు నీటి ప్రాజెక్టులకు సప్లయ్‌చానళ్ల సమస్యలు వేధిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా గండికోట, పైడిపాలెం, చిత్రావతి ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నీళ్లను నిల్వ చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా కొత్త ఏడాదిలో సంక్షేమ పథకాలు అమలవుతున్న నేపథ్యంలో జిల్లా వాసుల ఆశలు, ఆకాంక్షలు అంచనాల్ని మించి ఉన్నాయనడంలో సందేహం లేదు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి రథం నత్తనడకన సాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ప్రగతి పరుగులు తీయడంపై ప్రజానీకం ఆశలు పెంచుకుంది. ఇటీవలి జిల్లా పర్యటనలో జిజిహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ సదుపాయంతోపాటు కేన్సర్‌కేర్, ఎల్‌వి ప్రసాద్ కంటి యూనిట్, మెంటల్ ఇన్సిట్యూట్‌లను ప్రారంభించడం ఉపశమనం కలిగించింది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, రాజోలి, జొలదరాశి, కుందూ లిఫ్టు, జిఎన్ఎస్ఎస్-2 నుంచి రాయచోటికి లిఫ్టు మొదలగు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. యోగివేమన యూనివర్శిటీకి నిధుల కొరత, కొత్త కోర్సులు ఏర్పాటు, ఫ్యాకల్టీ నియామకాలు, నందలూరులో ఉద్యానవన యూనివర్శిటీ ఏర్పాటు, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు, ఒంటిమిట్ట కోదండరామాలయ మాస్టర్ ప్లాన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. కేంద్రం వెనుకబడిన నిధుల విడుదల పునరుద్ధరణ మొదలుకుని కొప్పర్తికి పర్యావరణ అనుమతి వరకు పెండింగ్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. 2014 రాష్ట్ర విభజనచట్టంలో పేర్కొన్న విధంగా కేంద్రప్రభుత్వం సెయిల్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉంది. కేంద్రం మొండివైఖరిని అవలంభించడంతో రాష్ట్రప్రభుత్వమే చొరవ తీసుకుని శంకుస్థాపన చేసింది. మూడేళ్లలో రూ.15 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొంది. ఈమేరకు గతేడాది ఫిబ్రవరి నెలాఖరులో శంకుస్థాపన చేసింది. కొప్పర్తి పారిశ్రామికవాడకు పర్యావరణ అనుమతి కొరవడిన నేపథ్యంలో పారిశ్రామిక ప్రగతి పడకేసింది. ఈనేపథ్యంలో రూ.150 కోట్లతో బ్రహ్మంసాగర్ నుంచి కొప్పర్తికి నీటి సరఫరా పైప్‌లైన్ ప్రతిపాదనలు సాకారానికి నోచుకోవడం లేదు. పలితంగా వేలాది మంది నిరుద్యోగులు పొట్ట చేతబట్టుకుని గల్ఫ్ ఇతర పశ్చిమ దేశాలకు వలసవెళ్తోంది. వీటికితోడు గండికోట, తెలుగుగంగ కాల్వల వెడల్పు పనులు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు, జిఎన్ఎస్ఎస్-2 పనుల మొదలుకుని, ఉమ్మడి జిల్లాలోని 15 రిజర్వాయర్ల పరిధిలో ఏ ఒక్క ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీర ందించే పరిస్థితి కనిపించడం లేదు. ఫలితంగా రిజర్వాయర్లలో నీళ్ల నిలిపినప్పటికీ సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. ఈ ఏడాది గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో అన్నమయ్య పునరుద్ధరణ, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ లీకేజీ మరమ్మతులు ఎప్పటికి సాకారమవుతాయో తెలియని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఇదిలా ఉండగా గండికోట, సోమశిల, పైడిపాలెం ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితులకు పెండింగ్ పరిహారం అందని మాని పండును తలపిస్తోంది. ఈనేపథ్యంలో ఈఏడాది సార్వత్రిక సమరం నాటికి నిర్వాసితులకు పెండింగ్ పరిహారం విడుదల, కొప్పర్తి, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు పర్యావరణ అనుమతులు పరిష్కరించడంపై ప్రజానీకం ఆశలు పెంచుకుంది. రాబోయే మూడు నెలల వ్యవధిలో ఏయే సమస్యలకు పరిష్కారం లభించనున్నదో వేచి చూడాల్సి ఉంది.



ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

- కార్గో సేవల్లో కడప మొదటి స్థానం
- సూపర్‌స్పెషాలిటీ సేవలతో భరోసా
- త్వరలో 50 కొత్త బస్సులు రాక
- కారుణ్య నియామకాలకు ఆమోదం
- జిల్లా ప్రజారవాణా అధికారి పి.గోపాల్‌రెడ్డి వెల్లడి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రయాణికులకు సురక్షిత, మెరుగైన సేవలను అందించడమే ప్రజారవాణా సంస్థ ధ్యేయం. ఇందులో భాగంగా ఇటీవల ప్రారంభించిన కార్గోసేవల్లో కడప జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. కార్గో ఇచ్చిన స్ఫూర్తితో రీజనల్ మేనేజర్ స్థాయి నుంచి ఇన్ స్పెక్టర్ స్థాయి అధికారుల వరకు నిరంతరం పర్యవేక్షిస్తాం. దీనికి తోడు దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను ఆర్ఎం బృందం వారానికోసారి ర్యాండమ్‌గా తనిఖీలు చేస్తోంది. ఫలితంగా కండిషన్ సక్ర మంగా ఉండడం, డీజిల్ వినియోగం తక్కువగా ఉండడం, విడి భాగాలు వంటి ఖరీదైన వ్యవహారాలను అదుపులో ఉంచే ప్రక్రియ కొనసాగుతోంది. దీనికితోడు ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తిం చిన కార్మికులకు శిక్షణ, మెళకువలను నేర్పడం వంటి శిక్షణా తరగ తులను నిర్వహిస్తున్నాం. ప్రజారవాణా సంస్థ ఆదాయాలను పెంచు కునేందుకు ఉద్దేశించి స్థానిక ఉత్సవాలైన కార్తీక మాసాత్సోవాలు, పొలతల, నిత్యపూజయ్యకోన, శ్రీరామనవమి, దసరా, సంక్రాంతి, పొరుగు రాష్ట్రాల్లోని అరుణాచలం, వేలాంగిణి వంటి ప్రసిద్ధ ప్రార్థనా ప్రదేశాలకు రవాణా సదుపాయాలను అందిస్తున్నామని పేర్కొంటున్న జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్‌రెడ్డితో ముఖాముఖి...

ప్రజా రవాణా సంస్థ సేవల గురించి తెలపండి?

ప్రజారవాణా సంస్థ లాభాపేక్ష రహితంగా ప్రయాణికులకు సురక్షిత, మెరుగైన సదుపాయాలను అందుబాటులో ఉంచుతోంది. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి నిత్యం వందలాది విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేస్తున్న వేలాది మంది విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులకు కన్‌సెషన్‌తో పాసులు, టికెట్లు మంజూరు చేస్తున్నాం.

డిపోల స్థితిగతుల గురించి చెప్పండి?

జిల్లాలో ఆరు డిపోలున్నాయి. ఇందులో 2,337 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 500 మంది అవుట్‌సోర్స్ ఉద్యోగులున్నారు. ఇందులో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ పట్టణాల్లో డిపోలున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ నాటికి కడప డిపో 22వ ర్యాంకుతో అత్యల్ప, పులి వెందుల అత్యధికంగా 80వ ర్యాంకుతో నష్టాలతో నడుస్తోంది.

లాభాల ఆర్జన ప్రణాళిక ఏమైనా ఉందా?

ప్రజారవాణా సంస్థను లాభాలబాట పట్టించడానికి అవసరమైన కసరత్తు చేపట్టాం. ఇందులో డీజిల్ ఆదా చేయడంపై డ్రైవర్లకు అవగాహన కల్పించడం, ప్రతినెలా ప్రతి డిపోలోని ఉత్తమ డ్రైవర్లకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరుగుతోంది. రద్దీ రహదారుల్లో ప్రయాణికులకు డిపోలవారీగా బహుమతులు అందించడం, ప్రయా ణ ప్రాంగణాల్లోని బస్సులను రీజినల్ మేనేజర్ స్థాయి నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో కూడిన నిపుణుల కమిటీ ర్యాండమ్‌గా తనిఖీలు చేపట్టడం జరుగుతోంది. వీటికితోడు కార్గో సేవలు, డోర్ డెలి వరీ వంటి సేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.

సంక్రాంతి ఏర్పాట్లు ఎలా ఉన్నాయ్?

జిల్లాలో 600 బస్సులున్నాయి. ఇందులో 550 బస్సులతో సంక్రాంతి పండుగకు రావడానికి ఉద్దేశించిన ప్రణాళికకు రూపకల్పన చేశాం. ఇందులో 190 సూపర్‌లగ్జరీ, 05 ఇంద్రా, 35 అల్ట్రాడీలక్స్, 10 ఎక్స్‌ప్రెస్ బస్సులను సాధారణ ఛార్జీలతోనే నడుపుతున్నాం. ఇందులోని 90 బస్సులు హైదరాబాద్, 80 బెంగళూరు, 30 విజయవాడ, 10 చెన్నయ్, 30 ఇతర బస్సు సర్వీసులను నడుపుతాం. వీటికి ఆన్‌లైన్ డిమాండ్ల ఆధారంగా అదనపు బస్సులను ఏర్పాటు చేసే ఆలోచనలూ ఉన్నాయి. తిరిగి వెళ్లడానికి ప్లానింగ్ చేస్తున్నాం.

బస్సుల వివరాలు తెలపండి?

ప్రజా రవాణా సంస్థ 240 బస్సులు నడుపుతోంది. రోజూ 2.40 లక్షల కిలోమీటర్ల మేర సంచరిస్తూ రూ.90 లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇందులో 04 డాల్ఫిన్, 08 ఇంద్రా, 04 అమరావతి, 09 స్టార్‌లైన్, 89 సూపర్‌లగ్జరీ, 26 అల్ట్రా డీలక్స్, 111 ఎక్స్‌ప్రెస్, 54 అల్ట్రా పల్లెవెలుగు, 240 పల్లెవెలుగు బస్సులను ఏర్పాటు చేశాం. ఫిబ్రవరి, మార్చి మాసాల్లో మరో 50 కొత్త బస్సు లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

కార్గోసేవల పని తీరు ఎలా ఉంది?

ప్రజా రవాణాసంస్థ కార్గో సేవల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. డోర్ డెలివరీ క్యాంపెయిన్‌లో మొదటి స్థానంలో ఉన్నాం. 11, 250 బుకింగ్ రిజిస్ట్రేషన్ల లక్ష్యాన్ని అధిగమించి 14, 765 బుకింగ్ రిజిస్ట్రేషన్లకు చేరుకున్నాం. ఈలెక్కన 127 స్థానాన్ని అందుకున్నాం. ఈమేరకు రూ.7.34 కోట్ల లావాదేవీలతో కార్గో వ్యవహా రాలు ముందుకు సాగుతున్నాయి.

కార్మికుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు అందిస్తున్నాం. సకాలంలో నాణ్యమైన వైద్య సేవలను అందించడం జరుగుతోంది. హెల్త్ స్కీమ్‌ను అమలు చేస్తున్నాం. సాధారణ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణానికి రూ.80 లక్షల వరకు బీమా సదుపాయం కల్పించాం.

రిక్రూట్‌మెంట్ల గురించి తెలపండి?

త్వరలో 70 కారుణ్య నియామకాలు చేపట్టనున్నాం. కలెక్టర్ ఆదేశాలు అందిన వెంటనే నియామకాలకు సంబంధించిన కసరత్తు చేపడతాం.

జిఓ 27ను రద్దు చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాజకీయ దళారీ, కబ్జాదారులకు చుట్టంగా ఉన్న భూహక్కు చట్టం జీవో నంబర్ 27 ను రద్దు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. రద్దు కోసం రైతు సంఘాల ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఆదివారం కడప రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఇతర స్థిరాస్తి హక్కులను న్యాయవ్యవస్థ పరిధిలో నుంచి తొలగించి అధికార పార్టీ రాజకీయ దళారి కబ్జాదారులకు అప్పగించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ చట్టం ప్రకారం ఎటువంటి అర్హత లేని న్యాయ శాస్త్ర అవగాహన లేని వారిని రాజకీయ పలుకుబడితో ఉపయోగించి బలహీనులైన రైతులను భూమిలో నుంచి వెళ్ళగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. ఈ చట్టం అమలైతే భూ హక్కుదారులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అధికార పార్టీ పర్యవేక్షణలోనే మండల భూ హక్కు చట్టం టైటిలింగ్ ఆఫీసర్ ఉంటాడని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, చిన్న సిద్దయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి



విభిన్న ప్రతిభావంతుడికి చెక్కు అందిస్తున్న ఒఎస్‌డి, సంస్థ ప్రతినిధులు

'మానవత' సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు మరువలేనివని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో అధ్యక్షులు నంబూరి సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ ఎంతోమంది పేదలను ఆదుకుంటున్నారని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వికలాంగులకు ఒఎస్‌డి చేతుల మీదుగా ఆర్థికసాయం అందించారు. అనంతరం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో అనిల్‌కుమార్‌రెడ్డికి సన్మానం చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాజేష్, ప్రొద్దుటూరు మెజిస్ట్రేట్ శ్రీనివాసులు, మానవత సంస్థ చైర్మన్ డి.వి.కొండారెడ్డి, కార్యదర్శులు సుబ్బరాయుడు, జి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పేస్ అకాడమీ వ్యవస్థాపకులు

పేస్ అకాడమీలో నాణ్యమైన ఐఐటి, నీట్ శిక్షణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులోని ఈ ప్రాంత విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ విద్యతోపాటు పేస్ అకాడమీ ద్వారా ఐఐటి, నీట్ మెడికల్ నాణ్యమైన శిక్షణ అందిస్తున్నట్లు పేస్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ జిలానీబాషా, డాక్టర్ శంకర్‌రెడ్డి, షాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎర్రగుంట్ల బైపాస్‌లోని పేస్ అకాడమీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థుల కోసం సేవా దృక్పథంతో అన్ని వర్గాల విద్యార్థులకు అనుగుణంగా ప్రొద్దుటూరులోనే నీట్, ఐఐటి అకాడమీ ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రొద్దుటూరులో పాఠశాల స్థాయి వరకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో పేరు పొందిన పేస్ అకాడమీ ద్వారా ప్రొద్దుటూరులోనే నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యతోపాటు మంచి అధ్యాపకులతో ప్రిపరేషన్ టెస్టులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇతర ప్రాంతాలలో చెల్లిస్తున్న ఫీజుల కంటే 40 శాతం తక్కువతోనే నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో బిజినెస్ మేనేజర్ శ్యామ్ పాల్గొన్నారు.

18వ శతాబ్దం నాటి దేవాలయం గుర్తింపు..!

ప్రజాశక్తి - ఒంటిమిట్ట




వీరనాగమ్మ పురాతన దేవాలయం

ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లె పంచాయితీలోని పత్రాపల్లెలో 18వ శతాబ్దం నాటి వీరనాగమ్మ దేవాలయాన్ని గుర్తించినట్లు హిస్టోరియన్, రచయిత బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం మీడియాకు తెలిపారు. దేవాలయం వెనుక భాగంలో ద్వార పాలకులు ఆపైన సింహం ప్రతిమ చెక్కినట్లు కనబడుతుందని తెలిపారు. దేవాలయంలో ఎడమవైపు వీరనాగమ్మ విగ్రహం, కుడివైపు వీర మార్తయ్య విగ్రహం ఉన్నట్లు ఆయన చెప్పారు. ఈ దేవాలయం అప్పటి నగిరి వాళ్ల ఆధీనంలో ఉండేదని, పాలెగాడు కదిరప్ప నాయుడు వంశానికి చెందిన కోటికె వెంకట మల్లయ్య తనకు చెప్పారని రచయిత వివరించారు. దేవాలయ విషయాన్ని మైసూర్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఇది 18వ శతాబ్దం నాటిదని చెప్పారని బొమ్మిశెట్టి తెలిపారు.

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

ప్రజాశక్తి - ఖాజీపేట



ఎంపిపి సిద్దిక్

ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఎంపిపి అబూబకర్ సిద్దిక్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. మండలాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ముందు కెళతానని తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలను ప్రత్యేకంగా తెలిపారు.

చర్చిలకు కేకులు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం మండలంలోని చర్చిలు, కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాథ ఆశ్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ కేకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రేపు అల్లాడుపల్లెలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులతోపాటు రిమ్స్ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. షుగర్, బిపి తదితర అన్ని రకాల రోగాలకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ

క్రైం కార్నర్

హుండీ చోరీ కేసులో అరెస్టు

పాత కడపకు చెందిన ఇద్దరు బాల నేరస్తులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని విశ్వనాథపురం గ్రామ ఆంజనేయస్వామి గుడిలో గతనెల 12న హుండీలను పగులగొట్టి నగదును అపహరించిన కేసులో దొంగలను అరెస్టు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన పాత కడపకు చెందిన ఇద్దరు బాల నేరస్తులైన గంగాధర్, లక్ష్మయ్యను పట్టుకున్నామన్నారు. వీరిని చాపాడు ఎస్ఐ మైనుద్దీన్ సిసిఎస్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వీరి వద్దనుంచి రూ.1,20,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాలకు ఉపయోగించిన ఒక పల్సర్ మోటార్ సైకిల్‌ను రికవరీ చేశారు. వీరిని బాలుర గృహానికి అప్పగించామని పోలీసులు తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

దుర్గంధాన్ని వెదజల్లుతున్న వీధులు - ప్రభుత్వానికి పట్టని పారిశుధ్య కార్మికుల సమస్యలు



ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు.. సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చేందుకు అధికారులు, ప్రభుత్వ పెద్దలు తయారుగా ఉంటారు.. కాని వారి కోర్కెలను ఆలకించే విషయంలో, వాటిని పరిష్కరించడంలో మాత్రం చిత్తశుద్ధి లోపిస్తోంది. ఆరు రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పట్టారు. ఫలితంగా ప్రముఖ వాణిజ్యకేంద్రంగా పేరున్న ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఎక్కడి చెత్త అక్కడ పేరుకు పోయింది. పట్టణంలో 41వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో చెత్తతీసే దిక్కులేక దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యమంత్రి జగన్ తన పాదయాత్రలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కార్మికులు అడుగుతున్నారు. జగన్ పదవీ బాధ్యతలు చేపట్టిన ఈ నాలు గున్నరేళ్ల కాలంగా కార్మికులు వివిధ రూపాలుగా ఈ విషయాలను గుర్తుచేస్తూనే వస్తున్నారు. నిరసనల రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు. కాని ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. రాష్ట్ర కార్మిక సంఘ(సిఐటియు అనుబంధం) పిలుపుమేరకు ప్రొద్దుటూరులో మొత్తం 240 మంది పారిశుధ్య కార్మికులు ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతామని చెబుతున్నా ఫలితం లేదు. కార్మికులు చేసే పని వేరెవరూ చేయలేకపోవడమే ఇందుకు కారణం. వీధుల్లో పేరుకుపోయిన చెత్త, మురికి కాలువలలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎత్తి ఊరికి దూరంగా పారవేసే పని కార్మికులు మాత్రమే చేయగలరు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల విషయంలో సానుకూలంగా వ్యవహించాలని, వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి

ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు సమస్యలు పరిష్కరించాలని గతంలో చాలా సార్లు అడిగాం. ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర సంఘం పిలుపుమేరకు నిరవధిక సమ్మె అనివార్యమైంది. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. న్యాయమైన కోర్కెలు మాత్రమే.. అదీ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకే అమలు చేయాలంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి. మురికి, దుమ్మూధూళితో నిండిన తమ జీవితాల పట్ల సానుకూలంగా స్పందించాలి.

- చంట, మున్సిపల్ కార్మిక సంఘ అధ్యక్షుడు

అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలి



పారిశుధ్య కార్మికులను అధికారులు సాటి మనుషులుగా గుర్తించి చిత్తశుద్ధితో వ్యవహరించాలి. కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలి. 30 మంది కార్మికులు అధి కారుల ఇళ్లల్లో పని చేస్తున్నందున తమకు పని భారమైంది. సెలవులు సక్రమంగా అమలు కావడంలేదు. అధికారులు చిత్తశుద్ధితో వ్యవ హరించి తమ సమస్యలు పరిష్కరించాలి.

- సాల్మన్, మున్సిపల్ కార్మిక సంఘ కార్యదర్శి

ఈ ఏడాదిలో కాంగ్రెస్‌కు ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఈ ఏడాది 2024లో కాంగ్రెస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పదేళ్ల అరణ్యవాసం ముగిసిందన్నారు. ప్రజలు మార్పు కోరుకొంటున్నట్లు చెప్పారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని విధాలా వైఫల్యం చెందిందని విమర్శించారు. రూ.115 లక్షల కోట్లు అప్పు చేసి దేశాన్ని రుణ భారత్‌గా చేసినట్లు తెలిపారు. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ రంగ స్థలాలను కారు చౌకగా అమ్మేస్తున్నట్లు తెలిపారు. వంట గ్యాస్, పెట్రోల్, డిజల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నట్లు చెప్పారు. నిరుద్యోగం విలయతాండవం చేస్తోందన్నారు. పార్లమెంటును కాపాడలేని బిజెపి ప్రభుత్వం దేశాన్ని ఏమి కాపాడుతుందని తులసిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని పేర్కొన్నారు. ప్రత్యేకహోదాకు పంగనామాలు పెట్టిందన్నారు. ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజికి తిలోదకాలిచ్చినట్లు చెప్పారు. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారానికి స్వస్తి పలికి, పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. జగన్ పాలనలో కూడా రాష్ట్రం అప్పులపాలైందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, చెన్నకేశవ, బద్రి, రాఘవయ్య, వినయ్, అమర్ పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమ వేగుచుక్క ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న విద్యార్థి ఉద్యమ వేగు చుక్క ఎస్ఎఫ్ఐ అని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ గుర్రం డేవిడ్‌రాజ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం నడింపల్లి బాయ్స్ హాస్టల్ వద్ద ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సురేష్ అధ్యక్షతన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా ఉన్న ఎస్ఎఫ్ఐ జెండాను డేవిడ్‌రాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ 1970 డిసెంబర్ 30న కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో అధ్యయనం,పోరాటం నినాదంతో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుండి ఇప్పటివరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ అనేక విజయాలు సాధించిందని వివరించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఏకమై పోరాడాలని, అందరికి నాణ్యమైన విద్య ఉపాధి అందే వరకు ఎస్ఎఫ్ఐ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఓబులేసు, శీను , మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పట్టణంలోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ జెండాను ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వీరపోగు రవి



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ అధ్యయనం.. పోరాటం నినాదంతో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు విజయభాస్కర్, సుబ్బయ్య, అశోక్ పాల్గొన్నారు.

70 కుటుంబాలు టిడిపిలో చేరిక



పార్టీలో చేరిన వారితో భూపేష్‌రెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో వైసిపికి భారీ షాక్ తగిలింది. మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బిసి కాలనీలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి సమక్షంలో ఆదివారం 70 కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరికి భూపేష్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దాదా పీర్, అబ్దుల్ ఖాదర్, అల్లాబకాష్, బాషామోదిన్, సత్తార్, ఫక్రుద్దీన్, అమిద్దీన్, అబ్దుల్ సుకుర్, మస్తాన్ వల్లి, గైబు దాదా, ఇమామ్ హుస్సేన్, ఇమామ్ బాషా, షేక్షావలి, షరీఫ్, రజాక్, ఖాజావలి, అబ్దుల్ రజాక్, సలీం, నాగేంద్ర, వెంకటరమణ, పెద్దిరాజు, చిన్నరాజు, కుమార్, డేవిడ్ తదితర కుటుంబాలు చేరాయి. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ పాత,కొత్త కలయికతో పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా.. తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జమ్మలమడుగు మండలం పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, బాలపుల్లారెడ్డి, శంకర్, మహేంద్ర, బికారి, రామచంద్ర, దేవమ్మ, బుజ్జి, హరి, కృష్ణమూర్తి, మల్లికార్జున, ఫిలిప్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అన్నీ బాదుడే

ముద్దనూరు : వైసిపి పాలనలో అన్ని రకాల ఛార్జీలను పెంచి ప్రజలపై అధిక భారాన్ని వేశారని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని తిమ్మాపురంలో ఆదివారం ఆయన ష్యూరిటీ గ్యారెంటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడరతూ జగన్ అబద్ధపు హామీలతో అధికారం లోకి వచ్చారని తెలిపారు. ఇంటింటికి తిరుగుతూ టిడిపి మినీ మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని భూపేష్ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, గ్రామ నాయకులు వీరప్రసాద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వీరారెడ్డి, హృషికేశవ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సాంబశివారెడ్డి, అశోక్, రమణారెడ్డి, భూషణం, విక్రమ్, నాగేష్, నాగమునిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌడ సంఘం బలోపేతానికి కృషి చేయాలి

పులివెందుల రూరల్ : గౌడ సంఘంలోని ప్రతి ఒక్కరూ సంఘ బలోపేతానికి కృషి చేయాలని పులివెందుల తాలూకా ఈడిగ, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని మిట్ట మల్లేశ్వరస్వామి కల్యాణమండపంలో నూతన సంవత్సర 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థికాభివృద్ధి చెందేలా కృషి చేయాలన్నారు. సంఘం అండగా ఉంటుందన్నారు. నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో జీవించాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి సంబంధించి త్వరలోనే సభ్యులతో చర్చిస్తామన్నారు. ఉపాధ్యక్షుడు సూర్య నారాయణ, గౌరవాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, పెద్ద రమణ, చిన్న, రమణ, ఆర్. మురళి, కండక్టర్ మధు, కల్యాణి, ఉమాదేవి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షులు కొండయ్య



రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

పొలాలకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - మైదుకూరు

మండలంలోని జివి సత్రం నుండి నాగసానిపల్లెకు వెళ్లే దారిలో లోకాయిపల్లె గ్రామం వద్ద రైతులు పొలాల్లోకి వెళ్లే దారిని ఏర్పాటు చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. ఆదివారం ఆ దారిని ఎవి రమణ, రిటైర్డ్ ఇఆర్ఒ పుష్పరాజ్, లోకాయపల్లె గ్రామస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రైతులు పొలాలకు వెళ్లే దారిని పూడ్చిన నేషనల్ హైవే అధికారులు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు మరో మార్గమైన అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలని రోడ్డు అధికారులను, మైదుకూరు మండల రెవెన్యూ అధికారులను కలిసినా స్పందనలేదన్నారు. సమస్య పరిష్కారానికి ప్రయత్నించకపోవడం పద్ధతి కాదని తెలిపారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు, రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయకపోతే రైతు సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, రైతులతో కలిసి పనులను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు కృపాకర్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.



ఉమాదేవి పాదయాత్రకు సంఘీభావం తెలిపిన టిడిపి నాయకులు

పాదయాత్రకు టిడిపి సంఘీభావం


ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి చేపట్టిన పాదయాత్రకు ఇడుపులపాయ టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావాలని పులివెందుల నుండి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం వేంపల్లెకు చేరుకుంది. ఈ నేపథ్యంలో వేంపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఇడుపులపాయకు చెందిన టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి పోతిరెడ్డి శివ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు పిపి చెంద్రాయుడు, భాను కిరణ్, వేమ నారాయణ, మహమ్మద్ ఘనంగా స్వాగతం పలికారు. గండిక్షేత్రం వరకు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తనయుడు మణికంఠరెడ్డి, రెడ్డయ్య, డక్కా రమేష్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కలసపాడు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జయరాములు పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామపంచాయతీలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంతవరకు గ్రామీణ ప్రాంతాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం అమలు చేస్తున్న పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని స్పంచులను, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లింగారెడ్డిపల్లె సర్పంచ్, పుల్లెం నారాయణ మాట్లాడుతూ ప్రతి గ్రామాలలో ఇంటింటికి కుళాయి, మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మురారి, పంచాయతీ కార్యదర్శి రేణుక పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న విజయ్ సుశీల్‌కుమార్, నాయకులు

విజయ్ సుశీల్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నందిమండలం విజయ్ సుశీల్ కుమార్‌ను ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి సుమంత్ కుమార్ మాట్లాడుతూ గతంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నందిమండలం విజయ్ సుశీల్ కుమార్ అనతి కాలంలోనే మంచి ప్రతిభ కనబరిచి జాతీయ, రాష్ట్ర నాయకత్వం మన్నులను పొంది రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడప జిల్లా వాసి నియామకం కావడం శుభ పరిణామం అన్నారు. కడప జిల్లా యూత్ కాంగ్రెస్ కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. సుశీల్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనను నియమించిన రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాబోవు రోజుల్లో కడప జిల్లాలో యూత్ కాంగ్రెస్ బలోపేతం కోసం రాష్ట్ర కమిటీ నుంచి సంపూర్ణమైన మద్దతు అండా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బద్వేల్ అసెంబ్లీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, పులివెందుల అసెంబ్లీ అధ్యక్షుడు కొమ్మది శ్రీసాయి, ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షుడు వంశీ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు చక్రి, ప్రభు కుమార్, చిన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

'ఎవరికి టికెట్ ఇచ్చినా అంకితభావంతో పనిచేస్తా'

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

రాజంపేట నియోజకవర్గంలో ఎవరికి టికెట్ ఇచ్చినా వారి విజయానికి అంకితభావంతో పనిచేస్తానని టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ పేర్కొన్నారు. ఆదివారం తన స్వగృహంలో అన్నమయ్య జిల్లా టిడిపి అధ్యక్షులు జగన్‌మోహన్ రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో ఎవరికి టికెట్ ఇచ్చినా అందరం కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిస్తామని అన్నారు చంద్రబాబు నాయుడు కచ్చితంగా ముఖ్యమంత్రి కావడం ఖాయం అని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అత్యంత మెజార్టీతో ప్రభుత్వ ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఓబినేని సుబ్బమ్మ మాట్లాడుతూ మండల స్థాయిలో మహిళలు, రాజంపేట నియోజకవర్గం లోని మహిళలు కూడా అంకితభావంతో పనిచేసి టిడిపి పార్టీ అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ఆమె అన్నారు కార్యక్రమంలో మండల కార్యకర్తలు, నాయకులు అందరూ పాల్గొన్నారు



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు